క్లుప్తంగా

ఉత్సాహంగా గడప గడపకు..



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 97వవార్డు 495 సచివాలయం పరిధిలోని జోగులాంబ బస్‌స్టాప్ ఏరియా, వుడా కాలనీ, రైల్వే విహార్, కార్మికనగర్‌లో ఎమ్మెల్యే శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 97వవార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మెంటి మహేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రఘు, కిల్లి అప్పారావు, విజయలక్ష్మి, రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్య కల్యాణం



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్య కల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

విద్యార్థినికి ఏయూ వీసీ అభినందన



హర్షితను అభినందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: జాతీయ స్థాయిలో భారత ప్రభుత్వం, లోక్‌సభ సెక్రటేరియట్, విద్య,యువజన, క్రీడల మంత్రిత్వ శాఖ ఈ నెల 9వ తేదీన పార్లమెంట్ హాల్‌లో నిర్వహించే గురు రవీంద్రనాథ్ ఠాగూర్ 162వ జయంతి వేడుకల్లో ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల విద్యార్థిని హర్షిత దేవగుప్తాపు పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా హర్షితను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి తన కార్యాలయంలో అభినందించారు. దేశ వ్యాప్తంగా 25 ప్రభుత్వ విద్యాలయాల నుంచి 25 మంది విద్యార్థులను ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించడానికి ఎంపిక చేశారు. పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో జరిగే కార్యక్రమంలో పాల్గొని రవీంద్రనాథ్ ఠాగూర్‌పై హర్షిత ప్రసంగిస్తారు. ఇటువంటి ప్రతిష్టాత్మక కార్యక్రమంలో ఏయూ విద్యార్థిని భాగం కావడం పై వీసీ ప్రసాద రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె.సమత, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరనాథ్, డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలి



తపన్‌సేన్‌కు వినతిపత్రం అందజేస్తున్న యువ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికుల నూతన వేతనాల అమలుకు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్‌ను స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయానికి శనివారం రాత్రి విచ్చేసిన తపన్‌సేన్‌ను కార్మికులు కలిసి వినతిపత్రం అందజేశారు. సెయిల్‌లో వేతన ఒప్పందం జరిగి ఏడాదిన్నర అవుతున్నా ఇక్కడ అమలు కావడం లేదన్నారు. కార్మికుల వేతన సవరణపై డీపీఈ గైడ్‌లైన్స్ అడ్డంకి అంటూ చెబుతుండటం అన్యాయమని తెలిపారు. వేతన అమలు జాప్యం వల్ల యువ కార్మికులుగా తాము పడుతున్న కష్టాలను ఆయనకు వివరించారు.

పదిలో మెరిశారు

- ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు
- సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలలు

పదో తరగతి పరీక్ష ఫలితాల్లో నియోజకవర్గంలోని జీవీఎంసీ,ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపారు. ఉపాధ్యాయుల కృషి, అధికారుల మార్గదర్శకత్వం ఫలితంగా మంచి మార్కులతో సత్తా చాటారు. ప్రైవేటు స్కూళ్లకు దీటుగా అత్యధిక మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. ప్రభుత్వ పాఠశాలలు గతేడాది కన్నా మెరుగైన ఫలితాలు సాధించి ఔరా అనిపించుకున్నాయి.

సింహాచలం: పదోతరగతి పరీక్ష ఫలితాల్లో సింహాచలంలోని మహాత్మా జ్యోతిబాపూలే ఏపీ బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈఏడాది 96.64 శాతం ఉతీర్ణత సాధించారు. పాఠశాల నుంచి మొత్తం 149 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 144 మంది ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ దాసరి సత్యారావు తెలిపారు. వీరిలో 500కి పైగా 50 మంది విద్యార్థులు సాధించారు.

సంస్కృతోన్నతపాఠశాలలో 98 శాతం ఉత్తీర్ణత

పదిలో సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాల 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి.భాను తెలిపారు. పాఠశాల నుంచి 40 మంది పరీక్షలు రాయగా 39 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. కె.హారిక , ఎ.శ్యామ్ అత్యధిక మార్కులు సాధించారు. వీరికి శనివారం పాఠశాలలో ఉపాధ్యాయులు స్వీట్లు తినిపించి అభినందలు తెలియజేశారు.

జెడ్పీ పాఠశాలలో 60 శాతం ఉత్తీర్ణత

పదో తరగతి పరీక్షాఫలితాల్లో అడవివరం జిల్లా పరిషత్ హైస్కూల్ 60 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రధానోపాధ్యాయుడు ఇమంది పైడిరాజు తెలిపారు. పాఠశాల నుంచి 84 మంది పరీక్షలు రాయగా 50 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. ఇంగ్లిష్ మీడియం నుంచి 61మందికి గాను 40 మంది, తెలుగు మీడియం నుంచి 23 మందికి గాను 10 మంది ఉత్తీర్ణత సాధించారని పేర్కొన్నారు.

సబ్బవరం మండలంలో 84.88 శాతం ఉత్తీర్ణత

సబ్బవరం: పదోతరగతి పరీక్షలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలల నుంచి 572 మంది హాజరు కాగా 438 మంది ఉత్తీర్ణులయ్యారు. 76.57 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు తెలిపారు. అలాగే మండలంలో గుర్తింపు పొందిన ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల నుంచి 387 మంది పరీక్షలకు హాజరు కాగా 376 మంది ఉత్తీర్ణులు కాగా 97 శాతం ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొత్తం 959 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 814 మంది ఉత్తీర్ణులు కావడంతో 84.88 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవో తెలిపారు.

పాఠశాలల వారీగా ఫలితాలు ఇలా..

- సబ్బవరం గురుకుల పాఠశాల నుంచి 70 మంది పరీక్షలకు హాజరు కాగా 60 మంది ఉత్తీర్ణులయ్యారు.
- సబ్బవరం కేజీబీవీ నుంచి 39 మంది పరీక్షలు రాయగా 32 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి 125 మంది పరీక్షలు రాయగా 92 మంది ఉత్తీర్ణులయ్యారు. 73 శాతం ఉత్తీర్ణత శాతం నమోదైంది.
- తవ్వవానిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులు హాజరుకాగా 14 మంది ఉత్తీర్ణులయ్యారు.
- నంగినారపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 99 మంది పరీక్షలకు హాజరు కాగా 63 మంది ఉత్తీర్ణులయ్యారు.
- మల్లునాయుడుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 69 మంది పరీక్షలకు హాజరుకాగా 51 మంది ఉత్తీర్ణులు కావడంతో 73 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 78 మంది హజరు కాగా 65 మంది ఉత్తీర్ణులు కావడంతో 83 శాతం ఉత్తీర్ణత సాధించారు.
- ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 107 మంది పరీక్షలకు హాజరుకాగా 77 మంది ఉత్తీర్ణులు కావడంతో 71.96 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

పెందుర్తి మండలంలో 71 శాతం ఉత్తీర్ణత

సింహాచలం: పదోతరగతి పరీక్షల్లో పెందుర్తి మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో 71శాతం ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి పైడపునాయుడు తెలిపారు.

- వేపగుంట జిల్లా పరిషత్ పరిషత్ హైస్కూల్‌లో 72 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ పాఠశాల నుంచి మొత్తం 138 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 100 మంది ఉత్తీర్ణులయ్యారు. 500 మార్కులు 15 మంది విద్యార్థులు సాధించారు.



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు కె.హారిక, శ్యామ్‌కు స్వీట్లు తినిపిస్తున్న ఉపాధ్యాయులు

- చింతలగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూల్లో 77శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి మొత్తం 100 మంది పరీక్షలకు హాజరు కాగా 77 మంది ఉత్తీర్ణత సాధించారు. 500కి పైగా మార్కులు 9 మంది సాధించారు.
- పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్లో 77శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి మొత్తం 350 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 270 మంది ఉత్తీర్ణత సాధించారు. 35మంది 500కి పైగా మార్కులు సాధించారు.
- శాంతినగర్ జిల్లా పరిషత్ హైస్కూల్లో 50శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి మొత్తం 18 మంది పరీక్షలు రాయగా 9 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.
- నరవ జిల్లా పరిషత్ హైస్కూల్లో 59 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 150 మంది పరీక్షలు రాయగా 88 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 14మంది 500కి పైగా మార్కులు సాధించారు.
- ఎంజేపీఏపీ బీసీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాల 94శాతం ఉత్తీర్ణత సాధించింది. పాఠశాల నుంచి మొత్తం 68 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 64 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో 18 మంది 500కిపైగా మార్కులు సాధించారు.
- గుర్రంపాలెం జిల్లాపరిషత్ హైస్కూల్లో 84 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి మొత్తం 37 మంది పరీక్షలు రాయగా 31మంది ఉత్తీర్ణత సాధించారు.
- జుత్తాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో 67శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి మొత్తం 124 మంది పరీక్షలు రాయగా 83 మంది ఉత్తీర్ణులయ్యారు.
- సరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 72శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి మొత్తం 57మంది పరీక్షలు రాయగా 41మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. 500కి పైగా మార్కులు ఇద్దరు సాధించారు.
- పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్లో 56 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పాఠశాల నుంచి మొత్తం 55 మంది పరీక్షలకు హాజరుకాగా 31మంది ఉత్తీర్ణత సాధించారు. 500కిపైగా మార్కులు ఇద్దరు సాధించారు.
- గొరపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో 81శాతం ఉత్తీర్ణత నమైదైంది. 21మంది పరీక్షలకు హాజరుకాగా 17మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఇద్దరు 500కిపైగా మార్కులు సాధించారు.
- రాంపురంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో 57శాతం ఉత్తీర్ణత నమైదైంది. పాఠశాల నుంచి 30 మంది పరీక్షలు రాయగా 17మంది విద్యార్థులు పాసయ్యారు.
- పెందుర్తి మండలం సరిపల్లి భాష్యం విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ కె. రమేష్‌కుమార్ తెలిపారు.
- సుజాతనగర్‌లోని రవీంద్రభారతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని జీఎం రమ్య, ప్రిన్సిపాల్ ఆర్.స్వరూప తెలిపారు. .

పరవాడ మండంలో 78 శాతం ఉత్తీర్ణత

పరవాడ: మండలంలోని 12 జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాల నుంచి 830 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కాగా 648 మంది పాసయ్యారు. 78 శాతం ఉత్తీర్ణత నమోదైందని మండల విద్యాశాఖ అధికారి ఎం.సునీత చెప్పారు.

- తానాం బీసీ గురుకుల పాఠశాల నుంచి పదో పరీక్షలకు 81 మంది హాజరు కాగా 77 మంది ఉత్తీర్ణత సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.అప్పలనాయుడు చెప్పారు.
- పరవాడ జిల్లా పరిషత్ పాఠశాల నుంచి 87 మంది పరీక్షలకు హాజరు కాగా 49 మంది ఉత్తీర్ణత సాధించారు.
- దేశపాత్రునిపాలెం జెడ్పీ పాఠశాలకు చెందిన 40 మంది పరీక్షలకు హాజరు కాగా 24 మంది ఉత్తీర్ణత సాధించారు.
- పెదముషిడివాడ జెడ్పీ పాఠశాలలో 109 మంది పరీక్షలకు హాజరు కాగా 98 మంది ఉత్తీర్ణత పొందారు.
- అగ్రహారం జెడ్పీ పాఠశాల నుంచి 22 మంది పరీక్షలకు హాజరు కాగా 15 మంది ఉత్తీర్ణత సాధించారు.
- పినమడక జెడ్పీ పాఠశాలలో 17 మందికి 11 మంది ఉత్తీర్ణులయ్యారు.
- తానాం బాలికల జెడ్పీ పాఠశాల నుంచి 56 మందికి 34 మంది ఉత్తీర్ణత సాధించారు.
- వాడచీపురుపల్లి జెడ్పీ పాఠశాలలో 138 మంది పరీక్షలకు హాజరు కాగా 124 మంది ఉత్తీర్ణత సాధించారని పాఠశాల హెచ్ఎం కర్రి జగన్‌మోహన్‌నాయుడు చెప్పారు.
- మెట్టపాలెం ప్రభుత్వ పాఠశాలలో 35 మంది పరీక్షలకు హాజరు కాగా 29 మంది ఉత్తీర్ణత సాధించారు.
- ముత్యాలమ్మపాలెం జెడ్పీ పాఠశాలలో 19 మందికి 13 మంది ఉత్తీర్ణత సాధించారు.
- లంకెలపాలెం జెడ్పీ పాఠశాలలో 95 మందికి 78 మంది ఉత్తీర్ణత సాధించారు. జి.గీతాచరణ్ 574 మార్కులు సాధించాడు.
- పరవాడ బాలికల జెడ్పీ పాఠశాలలో 84 మందికి 62 మంది ఉత్తీర్ణత సాధించారు.

త్వరితగతిన గుల్లేపల్లి రోడ్డు పనులు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్
- వీఎంఆర్డీఏ అధికారులతో సమీక్ష



వీఎంఆర్డీఏ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని గుల్లేపల్లి నుంచి సబ్బవరం పాతరోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన ప్రారంభించాలని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచించారు. విశాఖలోని వీఎంఆర్డీఏ కార్యాలయంలో ఎమ్మెల్యే అదీప్‌రాజ్ శనివారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.రోడ్డు పనులు ప్రారంభించేందుకు అవసరమైన భూ సేకరణ, సర్వే పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారులను అదేశించారు. సుమారు రూ.9.80 కోట్లతో 80 అడుగుల వెడల్పుతో విస్తరించనున్నారు. సమావేశంలో వీఎంఆర్డీఏ చీఫ్ ఇంజినీర్ శివప్రసాద్ రాజు, సీనియర్ ఇంజినీర్ భవానీ శంకర్, ప్లానింగ్ ఆఫీసర్ శిల్ప, సబ్బవరం తహసీల్దార్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

ఎంపీడీవో రమేష్‌నాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: గ్రామాల్లో విచ్చలవిడిగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలకు ఇకపై అధికారులు చెక్ పెట్టనున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంపీడీవో రమేష్ నాయుడు,సీఐ రంగనాథం శనివారం పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా జాతీయ రహదారులతో పాటు పలు ప్రధాన రహదారులకు అనుకుని ఉన్న గ్రామాల్లో రాజకీయ నేతలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీల వల్ల వివాదాలు తలెత్తుతున్నాయన్నారు. ఫ్లెక్సీల వల్ల రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. మరి కొన్ని గ్రామాల్లో రాజకీయ తగాదాలు తలెత్తుతున్నాయన్నారు.వీటిని దృష్టిలో పెట్టుకుని దీనితో ఎవరైనా ఇకపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలనుకుంటే పంచాయతీల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పండగ, ఇతర శుభకార్యాలు.. ఆయా సందర్భాన్ని బట్టి ఒక్కరోజు మాత్రమే అనుమతిని ఇవ్వాలని సూచించారు. లేని పక్షంలో వారి నుంచి పెద్ద మొత్తంలో అపరాధరుసం వసూలు చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈ అంశంపై గ్రామ సభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించా లని సూచించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో ఎస్.బాబూరావు, ఈవోఆర్డీ మహేష్, కార్యదర్శులు మూర్తిబాబు, జగదీష్, బ్రహ్మ, ప్రేమ్,లతా కుమారి, రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో కార్మిక చట్టాలు నిర్వీర్యం

- అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్
- ఉక్కు రిలే దీక్షకు సంఘీభావం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: శ్రామికుల కష్టనష్టాలను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల యజమానులకు కొమ్ము కాస్తూ, బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తోందని అఖిల భారత సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ విమర్శించారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షల్లో 814వ రోజు శనివారం కోక్‌ఓవెన్ విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తపన్‌సేన్ మాట్లాడుతూ విభజన హామీలను విస్మరించి రాష్ట్రాన్ని అన్ని విధాల నష్టాల్లోకి నెట్టిన కేంద్ర ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలన్నారు. ప్రైవేట్ కంపెనీలు అప్పులు చేసి తిరిగి కట్టకుండా ఎగ్గొడితే వాటిని రుణమాఫీ పేరుతో మాఫీ చేస్తున్నారని విమర్శించారు. ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించేలా ప్రజలను చైతన్యం చేసే విధంగా కార్మికులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈశ్వరాంబ జయంతి

ఉక్కునగరం: స్థానిక సత్యసాయి మందిరంలో ఈశ్వరాంబ దినోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన వేడుకలు వేకువజామున ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తనతో ప్రారంభమయ్యాయి. అనంతరం మందిరంలో రుత్వికుల ఆధ్వర్యంలో హనుమాన్ చాలీసా పారాయణం, రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బాలవికాస్ పిల్లలు తమ పిల్లలకు పాదపూజ చేశారు. బాలవికాస్ పిల్లలచే వేద పఠనం, అష్టోత్తరం, భజనలు జరిగాయి. సేవా కార్యక్రమాల్లో భాగంగా రాసాలమ్మ కాలనీకు చెందిన ఇద్దరు పేదల మహిళలకు విస్టీల్ మహిళా సమితి అధ్యక్షురాలు నుపుర్ భట్ చేతుల మీదుగా కుట్టు మిషన్లు అందజేశారు. నారాయణ సేవలో భాగం 300 మందికి ఆహార ప్యాకెట్లు అందించారు. బాలవికాస్ పిల్లల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సమితి విద్యా విభాగం సమన్వయకర్త జయశ్రీ గణేశన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అగనంపూడి వైద్యురాలు జె. భారతి, సమితి కన్వీనర్ జి. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మర్యాద పూర్వక కలయిక



విజయసాయిరెడ్డికి స్వాగతం పలుకున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయి రెడ్డిని విశాఖ విమానాశ్రయంలో శనివారంఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ఆదిరెడ్డి మురళి, నాయకులు దాసరి సత్తిబాబు, మహేష్, రఘు, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవం



సిద్ధి వినాయకుడిని దర్శించుకున్న గ్రామ పెద్దలు

పరవాడ: మండలంలోని నాయుడుపాలెంలో సిద్ధి వినాయక ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు వినాయకుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు.ఆలయ కమిటీ ప్రతినిధులు కూండ్రపు శ్రీనివాసరావు, కూండ్రపు మధు, గ్రామ పెద్దలు మాసవరపు అప్పలనాయుడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

దివాకర్‌కు ఘన నివాళి

పరవాడ: రాష్ట్ర బీసీ కమిషన్ నేత దివాకర్‌కు ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ ప్రతినిధులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు మొల్లి రమణబాబు, పెందుర్తి నియోజకవర్గ కన్వీనర్ కూండ్రపు కృష్ణంనాయుడు, అనకాపల్లి జిల్లా బీసీ మహిళా కార్యదర్శి కూండ్రపు ఉమామహేశ్వరి, ప్రతినిధులు మాసవరపు వెంకటయ్యనాయుడు తదితరులు దివాకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

పూర్వవిద్యార్థుల సమావేశం



పూర్వవిద్యార్థిని సత్కరిస్తున్న దృశ్యం

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ ఐఐఏఎంలో శనివారం జేఎన్‌టీయూ కాకినాడ వైజాగ్ చాప్టర్ పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. శనివారం సమావేశమైన విద్యార్థులు అలనాటి జ్ఞాపకాలను గుర్తుకుతెచ్చుకుని ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ కార్యదర్శి రామ్మోహనరావు మాట్లాడుతూ జేఎన్‌టీయూ కాకినాడలో చదవడం ద్వారా తమ బ్యాచ్ విద్యార్థులంతా పూర్తిస్థాయిలో ఉన్నత ఉద్యోగాలు సాధించారన్నారు. తమ బ్యాచ్‌తో పాటు ఇతర బ్యాచ్‌లలో జేఎన్‌టీయూ కాకినాడలో చదివిన విద్యార్థులలో విశాఖలో ఉన్నవారితో ఏటా సమావేశమై తమ భావాలను పంచుకోవడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా శనివారం సమావేశమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీప్రసాద్, వెంకటరమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి రెహమ్‌తుల్లా

పరవాడ: మ్యాచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ ఆధ్వర్యంలో జేఎన్ ఫార్మాసిటీలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎం.డి రెహమ్‌తుల్లా, కోటేశ్వరావు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు ముందుగా అందించాల్సిన ప్రథమ చికిత్సపై పరిశ్రమల ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రథమ చికిత్సలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముగింపు కార్యక్రమంలో మ్యాచువల్లీ ఎయిడెడ్ సొసైటీ ఫర్ రిస్క్ మిటిగేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎం.శివరాం ప్రసాద్, జెట్టి సుబ్బారావు, రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి రవికుమార్ శిక్షణ పొందిన ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేశారు.

రేపటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరం



వేసవి విజ్ఞాన శిబిరం పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో సోమవారం నుంచి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్టు గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి పోస్టర్‌ను శనివారం సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నతపాఠశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ శిబిరం నిర్వహణలో భాగంగా చిత్రలేఖనం, వ్యాసరచన, వక్తృత్వం, జనరల్ క్విజ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామన్నారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, యోగ,మ్యాజిక్, నృత్యం తదితర విషయాలపై నిపుణులతో అవగాహన కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దేవస్థానం పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు భాను, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు పాటించాలి



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

బీచ్‌రోడ్డు: ప్రతి ఒక్కరు ఇంధన వినియోగం తగ్గించుకొని భవిష్యత్తు తరాలకు కొరత లేకుండా చూడాలని గెయిల్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ ఎల్ఎస్ రావు పిలుపునిచ్చారు. సాక్షమ్ వాకథాన్ పేరుతో ఇంధన పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఆర్కేబీచ్‌లో నిర్వహించారు. ఆర్కేబీచ్ నుంచి వైఎంసీఏ వరకు సాగిన ఈ వాక్‌థాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎల్ఎస్‌రావు మాట్లాడుతూ ఇంధన వినియోగం తగ్గించుకునేందుకు నడక, సైక్లింగ్, ప్రజా రవాణా వినియోగించాలన్నారు. భారతదేశం అత్యధికంగా ఇంధనాన్ని దిగుమతి చేసుకోవడం జరుగుతుందన్నారు. కాబట్టి ఇంధన వినియోగం తగ్గించి దేశ ఆర్థిక వ్యవస్థకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పలువుర్ని సత్కరించారు. వాక్‌థాన్‌లో పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు.

చమురు దిగుమతులను తగ్గించాలి

బీచ్‌రోడ్డు: ముడి చమురు దిగుమతులపై మన దేశం ఆధారపడడాన్ని తగ్గించాలంటే ఇంధన పొదుపు చాలా అవసరమని హెచ్‌పీసీఎల్ డీజీఎం (సేల్స్) మురళీకృష్ణ అన్నారు. సాక్షమ్ పేరుతో హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో శనివారం బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీను నిర్వహించారు. ఈ ర్యాలీను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ మన దేశంలోని ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సుందర వదన్, కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.